ప్రజాశక్తి
గురువారం 25 డిసెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

నేర పరిశోధన కేసులను త్వరగా పరిష్కరించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తెచ్చిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డిని ప్రశంసిస్తూ, దుస్సాలువతో ఘనంగా సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి -ప్రజాశక్తి, పార్వతీపురం

రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యం

మున్సిపాలిటీల్లో మన వీధి - మన బాధ్యత బాగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి ఎంపిడిఒ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని, వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులను అమలు చేసి రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, కమిషనర్లతో సుపరిపాలనపై జిల్లా కలెక్టర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖను కలెక్టర్ సమీక్షిస్తూ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఎంపిడిఒలు దత్తత తీసుకున్న గ్రామాల్లోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాన లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. దీనికోసం నిపుణుల సలహాలను ఉపయోగించుకోవాలని, ప్రతి గ్రామంలో కనీసం 25శాతం మంది రైతులు అంతర్ పంటల పద్ధతిని పాటించేలా చూడాలన్నారు. దిగుబడి, ఆదాయం తక్కువగా ఉన్న మండలాలను గుర్తించి, అక్కడి రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించి వారిని అప్రమత్తం చేయాలని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఉందని, కావున భూసార పరీక్ష నుంచి రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేంత వరకు మండల, గ్రామ వ్యవసాయ అధికారులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ప్రసవానికి ముందు నుంచి ప్రసవ అనంతరం తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటికి చేర్చే వరకు పూర్తి బాధ్యతను తీసుకుంటామన్నారు. వీటిని ఎంపిడిఒలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, తగిన సూచనలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు, సమస్యలను గుర్తించి బిబిడిఒలు తెలియజేయాలని అన్నారు.

మున్సిపాలిటీల పరిధిలో మన వీధి - మన బాధ్యత బాగా జరగాలని కలెక్టర్ కమిషనర్లను ఆదేశించారు. చెత్తను ఆరుబయట వేయకుండా బుట్టల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రంగా ఉంచిన వీధి కౌన్సిలర్లను, నివాసితులను అభినందిస్తామని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటించాలని, ఇందుకు అవసరమైన మొక్కలను అందజేస్తామని వివరించారు. ఎంపిడిఒలు, మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వాసుపత్రులను సందర్శించి, మౌలిక వసతులు, మందులు, సిబ్బంది హాజరు వంటి వాటిని పరిశీలించాలని చెప్పారు. టిబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో అవగాహన కల్పించి టిబి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. మా ఊరికి మలేరియా వచ్చింది, గ్రామ ముస్తాబు కార్యక్రమాలతో ఘననీయంగా మలేరియా కేసులు తగ్గాయని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, కావున ప్రతి ఇల్లు, వీధి, గ్రామం పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎస్డీసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, సంబంధిత శాఖల అధికారులు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఉపాధ్యాయుల హక్కుల సాధనే యుటిఎఫ్ లక్ష్యం

రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కృష్ణారావు, భాస్కరరావు

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు అన్నారు. కురుపాంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో యుటిఎఫ్ నాలుగో జిల్లా కౌన్సిల్ సమావేశం రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు అధ్యర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిల కోసం రోడ్డు మ్యాప్ వేసి పిఆర్‌సి కమిటీని నియమించి సంక్రాంతి నాటికి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యుటిఎఫ్ నాయకులు కె.విజయ్ గౌరి మాట్లాడుతూ ప్రస్తుతం సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, దీనికి అవసరమైన విధానం పార్లమెంట్‌లో విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు విధిస్తున్న నైట్‌డ్యూటీలను తక్షణమే రద్దు చేయాలని ఇప్పటి వరకు ఉపాధ్యాయులపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కృష్ణారావు, భాస్కరరావు

కృష్ణారావు

అనంతరం యుటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా కె.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా కె.భాస్కరరావు, కోశాధికారిగా కె.మురళీతో పాటు 17మంది జిల్లాకార్యవర్గసభ్యులు, ఐదుగురు రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిబద్ధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

భాస్కరరావు

కొత్తగా ఎన్నికైన ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గసభ్యులు

ఏకగ్రీవంగా ఎపిఎన్‌జిఒ జిల్లా ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మన్యం జిల్లా ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా నామినేషన్ ప్రక్రియలో బుధవారం సింగల్ సెట్ నామినేషన్లు రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి టి.శ్రీధర్ బాబు, సహాయ ఎన్నికల అధికారి ఎ.సురేష్ ప్రకటించారు. అధ్యక్షులుగా జివిఆర్ఎస్ కిషోర్ (మెడికల్), అసోసియేట్ ప్రెసిడెంటుగా జి.సూర్యనారాయణ (మెడికల్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి.రామకృష్ణ (పంచాయితీరాజ్), టి.వెంకటనాయుడు (మెడికల్), ఎస్.భాస్కరరావు (ట్రెజరీ), వై.జయప్రకాష్ (పంచాయితీ రాజ్), పి.సురేష్ కుమార్ (ట్రెజరీ), వైస్ ప్రెసిడెంట్ (మహిళ)గా ఎస్ పద్మ (జిఎస్‌డబ్ల్యుఎస్), కార్యదర్శిగా కె.రంగాచారి (ఎడ్యుకేషన్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.విజయ్ కుమార్ (కమర్షియల్ టాక్స్), జాయింటు సెక్రటరీలుగా వి.శ్రీనివాసరావు (ఐటిడిఎ), సిహెచ్. శంకర రావు (జిఎస్‌డబ్ల్యుఎస్ అర్బన్), వి.గణపతిరావు (ఎడ్యుకేషన్), పి.చంద్రశేఖర్ (ఇరిగేషన్), ఎం.శ్రీధర్ (డిఎస్‌హెచ్), జాయింటు సెక్రటరీగా రేఖా వాణి(ఐసిడిఎస్), కోశాధికారిగా పి పద్మ (ట్రెజరీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి ఎ.రంజిత్‌నాయుడు వ్యవహరించారు. నామినేషన్ కార్యక్రమం ముందు సుమారు 700 ఉద్యోగులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎర్ర జెండాలతో నగరమంతా అలంకరించారు. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా ఎపి ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు కెబి శ్రీనివాసరావు, కె.ఆదిలక్ష్మి, జాయింటు సెక్రటరీ ఆర్.శ్రీస్వప్న పాల్గొన్నారు. పూర్వపు నాయకులు రామ్మూర్తి నాయుడు, సంఘమేశ్వర రావు, టి. జగన్నాధం నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెర్లాం తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎన్.నాగేశ్వర రావు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు తాలూకా నాయకులు, టౌన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, విక్టర్ మధు, జయగౌడ్ పాల్గొన్నారు.

కుట్రలు చేసే వారిని చట్టం వదలదు : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

రాజకీయంగా ఎదుర్కోలేక, వ్యక్తిగత కక్షలతో తప్పుడు ప్రచారాలు చేసే వారిని చట్టం కచ్చితంగా శిక్షిస్తుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. సోమవారం సాలూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల రోజులుగా పిఎ సతీష్, తన కుమారుడిపై సోషల్ మీడియా, వివిధ పత్రికల వేదికగా తప్పుడు ఆరోపణలు చేస్తూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి దేవీప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగి త్రివేణిని పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తనపై, కుటుంబంపై కావాలని తప్పుడు మెసేజ్‌లు సృష్టించి బదనాం చేయాలని చూశారని అవి అన్నీ పోలీసుల ఫోరెనిక్స్ విచారణలో వారి ఫోన్ల డేటా ఆధారంగా ఈ కుట్రలన్నీ వారే సృష్టించినట్లు తేలిందని వివరించారు. తాను ఉన్నత స్థానానికి ఎదగడం సహించలేని కొంతమంది జిల్లా స్థాయి నాయకులు, తెరవెనుక ఉండి వీరిని ప్రోత్సహిస్తున్నారని, వారి ద్వారా తప్పుడు కేసులతో మమ్మల్ని వేధించాలని చూశారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో పోటీ ఉండాలి కానీ, కుటుంబాలను, పిల్లలను లాగడం హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఇలాంటి పనులకు పాల్పడుతున్న వారిపై కూడా విచారణ జరుగుతోందని, తప్పు చేసే వారు ఎవరినైనా వదిలే ప్రసక్తే లేదని త్వరలోనే వారందరికీ తగిన శిక్ష పడుతుంది" అని ఆమె హెచ్చరించారు. రాజకీయాల్లో దమ్ము, ధైర్యం ఉంటే ఎదురుగా నిలబడి తాము చేసిన తప్పులను ఎత్తి చూపాలి గాని కుటుంబాలను, నా పిఎలను, సహాయకులను మానసికంగా ఇబ్బంది పెడితే తాను కృంగిపోతానని అనుకుంటున్నారేమో అదంతా మీ బమేనని, మీరు ఎంతగా తనను ఇబ్బందులు గురిచేసినా తాను రాజకీయంగా అంతే విధంగా ఎదుర్కొంటానని ఆమె పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సాలూరు పట్టణ, మండల, పాచిపెంట నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేశ్వరరావు, గూడెపు యుగంధర్, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పప్పల మోహన్, మజ్జి చిరంజీవిరావు, నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

వినియోగదారుల హక్కుల తెలుసుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హరగోపాల్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో వినియోగదారుల దినోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వినియోగదారుడు హక్కుల కోసం జిల్లా స్థాయిలో ఒక కమిటీ ఉందని, ఆ కమిటీ ఆధ్వర్యంలో న్యాయం జరిగే వరకూ పోరాడవచ్చన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు పైడి శంకర్రావు మాట్లాడుతూ వినియోగదారుడు వస్తువులు, నాణ్యత ధరలు విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పిఒ వెలమల అప్పారావు, చరిత్ర అధ్యాపకులు శ్రీనివాసరావు, ఒకేషనల్ అధ్యాపకులు విజయరాజు శివ కిషోర్ తదితరులు ఉన్నారు

మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సమగ్రశిక్ష సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సమగ్ర శిక్ష, కెజిబివిల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో ఆయా శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు పర్యటించారు. పాచిపెంటలో జరిగిన సమావేశంలో కాంతారావు మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ లేకపోవడం తక్కువ వేతనాలు, సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యాలు లేకపోవడంతోఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించడంలో తీవ్రమైన జాప్యం చేస్తుందని, తీవ్ర పని ఒత్తిడిలో ఉద్యోగులు ఉంటున్నారని తెలిపారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేర్వేరు వేతనాలు చెల్లించడం వల్ల అసమానతలు పెరుగుతున్నాయని, వెంటనే స్పందించి సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు పెంపు, బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దానికోసం భవిష్యత్తు పోరాటాలకు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు పోరాటానికి సిద్ధపడాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై సిఐటియు పోరాడుతుందని, ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరుగుతున్న 18వ అఖిల భారత మహాసభలో ఈ సమస్యలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటరావు, హరి, గణేశ్వర్, రమేష్, సుదర్శన్, లలిత, సంగీత, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు కె.ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

ఒక్క బాల్య వివాహమూ జరగరాదు

భూ వివాదంతో క్రిమినల్ కేసు నమోదు కారాదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో వచ్చే ఏడాదిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగరాదని, జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సంబంధిత అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహ నిషేధ చట్టం అమలుపై ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. 10 నుంచి 21 ఏళ్ల లోపు వయసు గల యువతీ యువకుల జాబితా ఆ మండల పరిధిలోని అధికారుల వద్ద ఉండాలన్నారు. ఎక్కడైనా వివాహమైతే వారం ముందుగా సమాచారం మండల తహశీల్దారుకు, పోలీస్ అధికారులకు అందజేయాలన్నారు. అనుమతి లేకుండా వివాహం చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు వివరించాలని అన్నారు. అలాగే మండల పరిధిలోని పురోహితులు, ప్రింటర్లు, ఇతరులకు ఇదే వర్తిస్తుందని, అనుమతితోనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తహశీల్దార్, ఎంపిడిఒ, కమిషనర్, ఎంఇఒ, ఎస్హెచ్ఒ, ఐసిడిఎస్, పంచాయతీ సెక్రటరీ, విఆర్ఒ, కార్యకర్తలు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. అనుమతి లేకుండా వివాహం జరిగితే చర్యలు తీసుకోవడంలో కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. జిల్లాలో రెవిన్యూ క్లినిక్ నడుస్తోందని, సాధ్యమైనంత వరకు ఎటువంటి భూతగాదాలు లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. భూవివాద కారణంతో ఒక్క క్రిమినల్ కేసు కూడా నమోదు కారాదని, కేసు నమోదైతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల సమాచారం లేదంటే వివాహాలు జరగనట్లుగా భావించరాదని, కావున గ్రామ, మండల స్థాయిలో పటిష్ట నిఘా అవసరమని అన్నారు.

గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ ముస్తాబు : కలెక్టర్

గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ ముస్తాబు, ఏజెన్సీలో ప్రజల జీవనశైలిని అర్థం చేసుకోవడానికి వారికి ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి గిరిజనుల ఇళ్లకు వెళ్లానున్న ఎంపిడిఒలు అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలను సందర్శిస్తారన్నారు. అక్కడ గిరిజన కుటుంబాల ఇళ్లకు వెళ్లి, వారితో కలిసి భోజనం చేసి, గిరిజన కుటుంబాల అలవాట్లు, సంప్రదాయాలు వారి జీవన విధానాన్ని దగ్గరగా పరిశీలించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమన్నారు. భోజనం చేస్తూనే గిరిజనుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించడానికి ఈ వేదికను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, క్షేత్రస్థాయిలో దీన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి : ఎపిఒ

ప్రజాశక్తి - సీతంపేట

శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులు మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. బుధవారం స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అన్వేష సైన్స్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐటిడిఎ పరిధిలోని 53 పాఠశాలల నుంచి 290 ప్రాజెక్టులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇలాంటి సైన్స్ ఫెస్ట్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సాంకేతిక అంశాలపై జ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా 7 అంశాల్లో నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. టీచర్స్ విభాగాల్లో నిర్వహించిన ప్రాజెక్ట్ లకు కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి అనంతరం అగ్రికల్చర్ విలేజ్ సమస్యలు పరిష్కారం క్విజ్ వివిధ ప్రాజెక్టుల గెలుపొందిన వారికి బహుమతులు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ గున్ను రామ్మోహనరావు, ఎటిడబ్ల్యుఒలు మల్లికార్జునరావు, సూర్యం, పిఎంఆర్‌సి సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, మల్లయ్య, ఎ.భాస్కరరావు, నారాయుడు, కోటి బాబు, వసంతలక్ష్మి, హెచ్ డబ్ల్యుఒ పి.అమల, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎపిఒ చిన్నబాబు

ఎమ్మెల్యేకు కేక్ అందజేస్తున్న క్రైస్తవ పెద్దలు

ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీక క్రిస్మస్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీక క్రిస్మస్ అని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం శాంతినగర్, సంపన్నగూడ చర్చిల ఫాదర్స్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి దైవ సేవకులకు తినిపించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో సంతోషంగా జరిగాయి. కార్యక్రమంలో ఆర్‌సిఎం మోంట్ ఫోర్ట్ ఫాదర్‌లు జాన్ విక్టర్ డైయస్, సంతోష్ ప్రభు, హెలెన్, క్రైస్తవ సోదరులు, నాయకులు తిరుపతి, బుద్దేశ్వరరావు మరియు అభిమానులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎఎస్‌పి

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎఎస్‌పి వి.మనీషా రెడ్డి బుధవారం తనిఖీలు చేశారు. వివిధ రకాల ఫైల్స్‌ను క్షుణంగా తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకుంటుందని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిసి, స్థానిక ఎస్సై వై సింహాసనం సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి ఎం.రాంబాబు పరిశీలించారు. స్టేషన్ లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించి, స్టేషన్ సిబ్బంది పనితీరు, వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. పోలీస్ స్టేషన్ పనితీరు సమీక్షించి సంతృప్తికరంగా ఉందని డీస్పీ అన్నారు. కార్యక్రమంలో చినమేరంగి సర్కిల్ సిఐ తిరుపతిరావు, స్థానిక ఎస్ఐ ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎఎస్‌పి మనీషారెడ్డి

మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వామపక్షాల ఒత్తిడితో 2005లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర పన్నుతుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ అన్నారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం మాట్లాడారు. మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబిజి రాంజీ పేరు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే విబిజి రాంజీ పేరును తొలగించి యధావిధిగా మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వేలాదిమంది గిరిజనులకు పని లేకుండా బిజెపి సిద్ధపడిందన్నారు. ఇదే జరిగితే గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి లేక వలస బాట పట్టాల్సి వస్తుందన్నారు. మహాత్మా గాంధీ పేరు స్థానంలో వీబిజి రాంజీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల వేలమంది గ్రామీణ గిరిజన పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కొత్త చట్టాన్ని రద్దు చేయకపోతే గిరిజన ప్రజానీకాన్ని ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతి, బిడ్డిక శంకర్రావు, మండంగి సన్యాసిరావు, బిడ్డిక ఆడిత్, బిడ్డక ప్రకాష్ రావు, కిల్లక. శంభు తదితరులు ఉన్నారు.

టెండర్ పేరుతో కాలయాపన సరికాదు : సిపిఎం

కొమరాడ : టెండర్ల పేరుతో పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు కాలయాపన చేయడం సరికాదని, తక్షణమే వంతెన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. నిర్మాణ పనులు నిలిపివేయడంతో శిథిలావస్థలో ఉన్న వంతెనను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులు విషయంలో టెండర్ల పేరుతో కాలయాపన చేయడం, మూడు టెండర్లకు పిలిచినా ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఉందని అన్నారు. కూటమి నాయకులు వంతెన పనులు పూర్తవుతాయని, రూ.20 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని ఒకవైపు చెబుతుంటే మరోవైపు పంచాయతీరాజ్ శాఖ అధికారులు టెండర్లకు పిలిచిన నిధులు చాలడం లేదని ఎవరూ ముందుకి రావట్లేదని చెప్పే పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో అటు కూటమి నాయకుల మాట నమ్మాలా ఇటు పంచాయతీరాజ్ శాఖ అధికారుల మాట నమ్మాలా తెలియని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో స్పందించి ఈ వంతెనకు సరిపడా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేసి టెండర్‌తో నిమిత్తం లేకుండా ప్రభుత్వమే చొరవ తీసుకొని పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

అవార్డును అందుకుంటున్న సంతోషికుమారి

పాఠశాలకు గుర్తింపు తెచ్చిన సంతోషి కుమారి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం ఎంపి పురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న డి.సంతోషి కుమారి అమరావతిలో ఈ నెల 23 ,24 తేదీల్లో జరిగిన సైన్సు ఫెయిర్ ఉపాధ్యాయుల విభాగంలో ప్రదర్శించిన టెస్ట్ లేసన్ అనే గణిత ప్రాజెక్టు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైంది. ఈ మేరకు ఎంఇఒలు గౌర్నాయుడు ,ఆర్ ఆనందరావు, క్లస్టర్ చైర్మన్ సిహెచ్ రత్నాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పార్లమెంటు కమిటీలో సాలూరు నాయకులకు చోటు

ప్రజాశక్తి - సాలూరు

అరకు పార్లమెంటు టిడిపి కమిటీలో సాలూరు నియోజకవర్గ నాయకులకు చోటు దక్కింది. పాచిపెంట మండలానికి చెందిన సీనియర్ నాయకులు, జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావును పార్లమెంటు కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. మెంటాడ మండలానికి చెందిన మరో సీనియర్ నాయకులు గెద్ద అన్నవరాన్ని పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించారు.


డిపాజిట్ చెక్కును కిశోర్ తండ్రికి అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

సహకార బ్యాంకు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా సహకార అభివృద్ధి బ్యాంకు పురోగతికి తన వంతు కృషి చేస్తానని పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్‌కుమార్ తెలిపారు. సహకార రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో బుధవారం ఆయన తన తండ్రి పేరు మీదగా ఆ బ్యాంకులో రూ.3 లక్షల డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి సహకార బ్యాంకులే ప్రధాన భరోసా అని రైతులు, చిన్న వ్యాపారులు బ్యాంకు సేవలను మరింతగా వినియోగించుకోవాలని, తక్కువ వడ్డీరేటుతో రుణాలు, పొదుపు ఖాతాలు, డిపాజిట్లు వంటి సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. పలువురు రైతులను డిపాజిట్లు చేయించి, కొత్త ఖాతాలు తెరిపించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. బ్యాంకు అభివృద్ధి అంటే రైతు అభివృద్ధి అన్న దృక్పథంతో ముందుకు సాగుతామని, సహకార స్ఫూర్తితో అంతా ముందుకు వస్తే బ్యాంకు మరింత బలంగా ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసిన విజయనగరం ఎంపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల పురోగతి అంశాలపై పరస్పర అభిప్రాయాలు పంచుకున్నారు. సమన్వయంతో ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

సత్తాచాటిన సంజన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పెద్దింటి సంజన నాలుగు కిలోమీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించింది. బుధవారం కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ క్రాస్ కంట్రీ అండర్ -18 విభాగంలో నాలుగు కిలోమీటర్ల పరుగు పందెంలో సత్తా చాటడం పట్ల ప్రిన్సిపాల్ డిజిఎస్‌వి త్రినాథ, అధ్యాపకులు, గ్రామ పెద్దలు, క్రీడా అభిమానులు, తదితరులు అభినందనలు తెలిపారు. సంజన ప్రస్తుతం బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఉమామహేశ్వరరావు వద్ద శిక్షణ పొందుతుంది.

పేద విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని పెదభోగి పంచాయతీ పరిధిలో గల బుడ్డిపేటలో పేద విద్యార్థులకు మమ్ముల సంతోష్ కుమార్ పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తలవంతు సహకారాన్ని అందించేందుకు ముందు ఉంటానని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సివిఎల్ నాయుడు, సంఘం నాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి గుణవతి

గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత : వైస్ ఎంపిపి

ప్రజాశక్తి - సాలూరు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర - సాకారం' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మామిడిపల్లిలో చెత్త సేకరణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ట్రాక్టర్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సువ్వాడ శశికళ, సర్పంచ్ ప్రతినిధి సువ్వాడ రామకృష్ణ, గ్రామ పెద్దలు బుస తౌడు, డొంక అన్నపూర్ణ, తాడుతూరు తిరుపతిరావు, సాదాపు త్రినాధరావు, వార్డు మెంబర్లు మరియు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాచిపెంటలో నెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయనగరంటౌన్ : విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు పాల్గొనే స్త్రీ, పురుష జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం పాచిపెంట మండలంలోని జిటిడబ్ల్యూఎహెచ్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు, కార్యదర్శి పివిఎస్ఎన్ రాజు, ఇందుకూరి లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28వ తేదీలలో రావులపాలెంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు జరగనున్న నేపథ్యంలో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

అవగాహనతోనే డ్రగ్స్ నిర్మూలన : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలతో ప్రగతిని సాధించాలన్నారు. ముఖ్యంగా డ్రగ్స్ నివారణ ప్రజల్లో అవగాహన ద్వారానే సాధ్యమౌతుందని, ఇందుకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం, జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటి సమావేశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులకు సైతం డ్రగ్స్ రవాణా, గంజాయి, మత్తు పదార్థాల నివారణ పట్ల అధ్యాపకుల ద్వారా చైతన్యపరచాలని చెప్పారు. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వారిని ఇందులో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. సంతలు, షాపులు వద్ద మత్తు పదార్థాల విక్రయించే వారి వివరాలు అందజేసేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పోలీస్, తహసీల్దార్, సచివాలయ సిబ్బంది, సర్పంచ్, ఎస్.హెచ్.జి తదితరులతో అధికారులు అందరూ హాజరై అన్ని విషయాలపై ప్రజలకు చైతన్యపరచాలని అన్నారు. అటవీ ప్రాంతం గుండా, బస్సులు, ఇతర వాహనాల ద్వారా జరిగే మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని అన్నారు. రహదారి భద్రతపై మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాల సంఖ్య తగ్గినప్పటికీ, వాటిని పూర్తిగా నివారించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని పట్టణ రద్దీ ప్రదేశాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, మోటార్ వాహనదారులు సీట్ బెల్టును విధిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మత్తు పదార్థాల కట్టడికి చేపడుతున్న కట్టుదిట్టమైన చర్యలను కలెక్టర్‌కు ఎస్‌పి వివరించారు. జిల్లాలో ప్రమాదాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా చేసేందుకు పోలీస్ యంత్రాంగం తరపున అన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. రవాణా, అటవీ, ఆర్‌టిసి, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలను, దాడుల్లో పట్టుకున్న సరుకుల వివరాలను ఎస్పీ కలెక్టరుకు వివరించారు. సమావేశంలో ఎఎస్పీ మనీషా రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఎస్పీ ఎం.రాంబాబు, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్ర రావు, టి.కనక దుర్గ, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్. మన్మథరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కర రావు, సిపిఒ ఎస్.ఎస్.ఆర్.పట్నాయక్, బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్, డిఇఒ బ్రహ్మాజీరావు, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన సేవలు అందుతాయని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ పర్యవేక్షణలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ 84 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులకు కంటి అద్దాలను జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలతతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు, నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ వార్తా సేకరణలో నిమగ్నమయ్యే మీడియా ప్రతినిధుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. అందులో భాగంగా గత నెలలో నిపుణులైన వైద్య పరీక్షలతో పాటు కంటి వైద్యులతో ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నాణ్యమైన కళ్లద్దాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్‌జి.నాగభూషణరావు, ప్రోగ్రాం మేనేజర్లు డాక్టర్ టి.జగన్మోహన రావు, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, జిల్లా సమన్వయ కర్త ఎ.ఉమాశంకర్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిఎస్ఆర్ మేనేజర్ యు.రమాదేవి, ప్రోగ్రామ్ మేనేజర్ కుల్‌దీప్, ఆప్తామిస్ట్ కోమలి, మార్కెటింగ్ మేనేజర్ భీమశంకరం, ప్రభుత్వ ఉద్యోగులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జంఝావతి సాధనే లక్ష్యం..

దీక్షలకు సమాయత్తం

బాధిత గ్రామాల్లో పర్యటించిన సాధన సమితి ప్రతినిధులు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి సాధనే తమ లక్ష్యమని జంఝావతి సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు అన్నారు. ఆ సమితి ప్రధాన కార్యదర్శి పల్లి రాజగోపాలనాయుడు, కార్యనిర్వాహక కన్వీనర్లు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, వంగల దాలి నాయుడు తదితరులతో కలిసి జంఝావతి బాధిత గ్రామాలైన సోమినాయుడు వలస, గంగ రేగువలస, కుమ్మరి గుంట తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లోని పెద్దలు, రైతులు, నాయకులతో కలిసి గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందరేగా ఆయా గ్రామాల్లోని జంఝావతి ప్రాజెక్టులో ఉన్న ఆయుకట్టు భూములపై చర్చించారు. జంఝావతి ప్రాజెక్టుల నీరు వృథాగా పోతోందని, సాగునీరు లేక రైతులు సాగు మానుకునే దుస్థితి ఏర్పడుతుందన్నారు. అందుకే ప్రాజెక్టు సాధన లక్ష్యంగా సమితిలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏర్పాటు చేసిన బాధిత గ్రామాల సమితులతో త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సాధన దీక్షలు ప్రారంభిస్తామన్నారు. కాబట్టి రైతులంతా ఏకమై పూర్తిస్థాయి ప్రాజెక్టును సాధించుకునేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

28న కంది కొత్తల పండగ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 28 ఆదివారం గుమ్మలక్ష్మీపురం హెచ్ మైదానంలో కందికొత్తల పండగను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తోయక నాగభూషణ్, పత్తిక శంకరరావు ఒక ప్రకటన లో తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కోడి, మేక,చేపల వ్యర్థాలు తరలించేందుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల కోడి, మేక, చేపల వ్యర్థాలను (బల్క్‌వేస్ట్) ఆయా దుకాణాల నుంచి సేకరించి డంపింగ్ యార్డ్‌లో వేయకుండా సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు 2016 ప్రకారం, కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి నిబంధనలను అనుసరించి, తరలించి మున్సిపల్ కార్యాలయానికి నెలకు రూ.25వేలు యూజర్ ఛార్జీలు చెల్లించేందుకు ఆసక్తిగల వారు ఈనెల 27న ఉదయం 12 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలం పాటకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ కె.కిషోర్ కుమార్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

రక్తదాన, వైద్యశిబిరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి వ్యక్తి రక్త దానం చేసి ప్రాణదాత కావాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయిక జగదీశ్వరి అన్నారు. మండల టిడిపి కన్వీనర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శానాపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు జన్మదినం సందర్భంగా ఆయన తల్లి అనసూయమ్మ జ్ఞాపకార్థం నెల్లిమర్ల మిమ్స్ వైద్యులచే రక్తదాన శిబిరం,ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత శేఖర్‌పాత్రుడికి జగదీశ్వరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు ఇతర సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తే అక్కడకు తక్షణమే యువతీ, యువకులు, ప్రజలు స్వచ్ఛంగా ముందుకెళ్లి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. పుట్టినరోజు సందర్భంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కళావతి, వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, కూటమి నాయకులు భారతి, బురిడీ కాళిదాస్, గొట్టాపు త్రినాధరావు, పప్పల గోపాలకృష్ణ, రాఘవ, భాను, సతివాడ శంకర్, నారాయణ, బత్తిలి శ్రీను, నూకరాజు, శివన్నారాయణ, ద్వారపు రెడ్డి సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి జస్టిస్ చీకటి మానవేంద్రనాద్‌రాయ్ జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంలో బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి, ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి, సీతంపేట ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నల్ జగన్నాథ ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు,. అనంతరం పూలమొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

సామాజిక బాధ్యతతో కూడిన పౌరులుగా ఎదగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సామాజిక బాధ్యతతో కూడిన పౌరులుగా విద్యార్థులు ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆకాంక్షించారు. అన్యాయాన్ని ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే మీకు తగిన న్యాయం లభిస్తుందని అన్నారు. వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువులతో మోసపోయినప్పుడు తగిన నష్టపరిహారం పొందవచ్చన్నారు. ఏ వస్తువు కొన్నా కచ్చితంగా బిల్లు తీసుకోవాలని, బిల్లు ఉంటేనే కోర్టులో ఫిర్యాదు చేయడానికి వీలుంటుందని అన్నారు. అలాగే వస్తువులపై ఐసిఐ, అగ్మార్క్, హాల్ మార్క్ వంటి గుర్తులను చూసి మాత్రమే కొనాలని, ముఖ్యంగా ఆహార పదార్థాలు, మందులు కొనేటప్పుడు తయారీ, గడువు తేదీలను గమనించాలని అన్నారు. సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్న నేటి కాలంలో, కేవలం చదువుకోవడం మాత్రమే కాకుండా బాధ్యతాయుతమైన 'ఉత్తమ పౌరులుగా' ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. కార్యక్రమం చివర్లో వినియోగదారుల హక్కుల రక్షణలో విశేష కృషి చేసిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ జీవాన్ని నాశనం చేస్తున్న రసాయన ఎరువులు

ప్రజాశక్తి - కురుపాం

రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు అధికంగా వాడడం వల్ల భూమి జీవం కోల్పోతుందని ఉత్తర కోస్తా నేచురల్ ఫామింగ్ అగ్రికల్చరల్ అడిషనల్ డైరెక్టర్ కె.ప్రకాష్ తెలిపారు. మండలంలోని సీతంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతులకు రసాయన పంటల వినియోగం వల్ల జరిగే ప్రమాదాల గూర్చి అవగాహన కల్పించారు. కేన్సర్, సుగర్, జీర్ణవ్యాధులు పెరుగుతున్నాయన్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవామృత వినియోగం, అంతర్ పంటల సాగుతోనే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. కావున ప్రతి రైతు సేంద్రీ వ్యవసాయం సాగు చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి, అధ్యాపకులు, రైతులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధిగా సంతోష్

ప్రజాశక్తి - పాలకొండ

అరకు పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధిగా గంట సంతోష్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం పట్టణ టిడిపి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈయన ఇటీవల జరిగిన పలు ఎన్నికల్లో కష్టపడి పనిచేశారు. ఈ మేరకు ఆయనకు ఈ పదవిని అధిష్టానం ఇచ్చినట్టు ఆ పార్టీలో చర్చ జరుగుతుంది.

వారపు సంతకు పండగ కళ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో బుధవారం జరిగిన గిరిజన వారపు సంతకు పండగ కళ సంతరించుకుంది. డిసెంబర్ 25 క్రిస్మస్, 28 కంది కొత్తల పండుగ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన జనంతో సంత కిటకిటలాడింది. కొత్త బట్టలు, పాత్రలు పిండి వంటలకు వస్తు సామాగ్రి కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. వ్యాపారులు వేలాది రూపాయలు అమ్మకాలు చేపట్టారు.

ఏజెన్సీ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి

మార్కెట్ ధర లేక గిరిజనులు విలవిల

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా చేయూతనిచ్చే పంటల్లో పసుపు ఒకటి. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో దిగుబడి తగ్గింది. మరోపక్క కాస్తో కూస్తో పండిన పసుపు పంటకు మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సీతంపేట ఏజెన్సీ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. మైదాన ప్రాంత వ్యాపారులు, ప్రజలు ఏజెన్సీ పసుపు వైపు మొగ్గు చూపుతారు. ఎందుకంటే ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజసిద్ధంతో తయారు చేస్తారు. ఈ పసుపునకు రంగు, రుచి, ఛాయ ఉంటుంది. సీతంపేట ఏజెన్సీలో సుమారు 1000 ఎకరాల్లో 2వేల మంది రైతులు సాగు చేస్తున్నారు. మండలంలోని కడగండి, కుసిమి, బుడగరాయి, పూతికవలస దోనుభాయి పరిసర ప్రాంతాల్లో విస్తారంగా సాగు జరుగుతుంది. పసుపు సీజన్ ప్రారంభమైనప్పటికీ గిరిజనులు పసుపును సేకరించి కావిడిలతో సోమవారం సీతంపేట సంతకు, బుధవారం మర్రిపాడు, శనివారం కుసిమి సంతలకు తీసుకొస్తున్నారు. అయితే కావిడి పసుపుకొమ్ములు రూ.800 పలకడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది రూ.వెయ్యి పలికేదనీ వాపోతున్నారు. బయట మార్కెట్లో పసుపు కొమ్ములు కిలో రూ.160 కాగా, కేజీ పసుపు రూ.200 వరకు పలుకుతుంది. అటువంటి బయట మార్కెట్లో ధర ఉన్నప్పటికీ వ్యాపారులు, దళారీలు ఏకమై కారుచావుగా కొనుగోలు చేయడానికి సిండికేట్‌గా మారుతున్నారు. ఈ పసుపును విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, పర్లాకిమిడి తదితర పట్టణాల్లో తరలించి ప్రాసెసింగ్ చేసి బ్రాండెడ్‌గా మార్చి అధిక లాభాలకు ఆర్జిస్తున్నారు.

తయారు చేసే విధానం

ఏజెన్సీలో పసుపు పంట ఏడాది తప్పించి సంవత్సరం కాపునకు వస్తుంది. కొండపైన సాగులో ఉన్న భూమి లోపల తవ్వి పసుపు మొక్కల కింద ఉన్న మట్టిని తొలగించి శుభ్రం చేసి పసుపు కొమ్ములు తీసి పెద్ద ట్రబ్బులో ఉడకబెడతారు. ఆ తర్వాత ఎండలో ఆరబెట్టి, పొర ఎక్కినంత వరకు గోనులతో నూరుస్తారు.

అకాల వర్షాలకు పసుపు, అల్లం పంటలకు నష్టం

ఈ ఏడాది వర్షాలు అధికంగా పడడంతో దిగుబడి తగ్గింది. పంట అధికంగా కాపునకు వస్తాదని ఆశపడ్డం కానీ, ప్రయోజనం కనిపించలేదు. పసుపు పంట కొంతైనా ఆదుకునేది ఇప్పుడు ప్రస్తుతం లేదు.

సవర చుక్కయ్య, చాపరాయిగూడ.

మర్రిపాడు సంతకు పసుపు తీసుకొచ్చిన గిరిజనులు

మార్కెట్ ధర లేదు

ఈ ఏడాది అనుకున్నంత పంట కాపు లేకపోనప్పటికీ ఉన్న పసుపు పంటకు మార్కెట్ లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి కొనుగోళ్లు లేకపోవడంతో సంతలో అతి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

సవర చిన్న,
చాపరాయి గూడ, గిరిజనుడు.

పసుపు రైతులకు ప్రోత్సాహం

పసుపు రైతులను ఐటిడిఎ ప్రోత్సహిస్తుంది. ఇందులో భాగంగా ఉడకబట్టిన బాయిలర్స్ పాలిష్ యంత్రాలు 90శృాతం సబ్సిడీలో అందిస్తుంది. రైతులకు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం.

పి జయశ్రీ, హార్టికల్చర్ అధికారి సీతంపేట

మృతుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురానికి చెందిన కండాపు శ్రీనివాసరావు, గడగమ్మ గ్రామానికి చెందిన అరసాడ ప్రసాదరావు ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందారు. ఈ మేరకు వీరి కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, బల్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, ఎన్ శశి కుమార్, కె.ధర్మారావు, ఎపిఒ జి.సత్యంనాయుడు, కడగల దాము, ఖండాపు హరి, ఎ.కృష్ణబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

కేదారిపురంలో పీసా గ్రామసభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం పంచాయతీ కేడికాలనీలో పీసా గ్రామసభ బుధవారం నిర్వహించారు. ఉపాధ్యక్షులు బిడ్డిక అనిల్ కుమార్, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి బి సురేష్ ఆధ్వర్యంలో గిరిజన సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థి కూనేటి మహేష్ (22) బుధవారం వసతి గృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్, విద్యార్థులు అందించిన వివరాలు ప్రకారం.. సాలూరు మండలంలోని జిల్లేడువలస గ్రామానికి చెందిన మహేష్ మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకోగా, బుధవారం ఉదయం తోటి విద్యార్థులు గమనించారు. మహేష్ డిగ్రీ పూర్తిచేసి 2024లో ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం డైట్ కళాశాలలో చేరాడు. ఇక్కడే ఉన్న బాలుర వసతి గృహంలో తోటి విద్యార్థులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వసతిగృహంలో ఉన్న రీడింగ్ రూమ్‌లో సహ విద్యార్థులతో కలిసి చదువుకున్నాడు. అందరూ గదుల్లోకి వెళ్లిపోయినా మహేష్ మాత్రం అక్కడే ఉండిపోయాడు. రాత్రంతా రూమ్‌కు రాకపోవడంతో ఉదయం 6 గంటలకు ఆయన రూమ్మేట్స్ రీడింగ్ రూమ్‌కు వెళ్ళి చూశారు. అప్పటికే మహేష్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న వెంటనే మా సిబ్బందితో కలిసి వసతిగృహాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. ఆర్‌జెడి విజయ్ భాస్కర్, డిఇఒ మాణిక్యంనాయుడు, రిటైర్డ్ డిఇఒ డాక్టర్ ఎన్‌టి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. మహేష్ మృతి పట్ల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, అధ్యాపకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా ఆత్మహత్యకు పాల్పడ్డ మహేష్ చేతిలో సూసైడ్ లెటర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ లెటర్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. తన కుటుంబ పరిస్థితి, తాను ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలను అందులో పొందుపరిచినట్లు భోగట్టా. లేఖలోని వివరాలను పోలీసులు వెల్లడిస్తే కారణాలు తెలిసే అవకాశం ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటున్నారు.

నాలుగు గంటల్లోనే దొరికిన దొంగ

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 23న కొండాపురం గ్రామంలో గాయత్రి ఆలయంలో పట్టపగలు దొంగల పడి అమ్మవారి విగ్రహం మీద ఉన్న 80 వేల రూపాయలు విలువచేసే 23 గ్రాముల బంగారాన్ని అపహరించారు. అయితే 24 గంటలు లోపే పోలీసులు ఈ కేసును ఛేదించి దొంగలను పట్టుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో సిఐ ఏ.ప్రసాద్ రావు, ఎస్ఐ ప్రయోగమూర్తి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్త్రీ, పురుషులిద్దరు వచ్చి ఆలయం నుంచి బయటకు వెళ్లాక విగ్రహంపై ఉన్న బంగారం మాయమైందని ఆలయ అర్చకులు పోలీసులకు తెలిపడంతో పోలీసులు ఆలయానికి వచ్చిన పాలకొండ పట్టణంలోని ఎన్ఎస్ఎన్ కాలనీకి చెందిన అసలు చిన్నారావు అతను భార్య బమ్మిడి దుర్గలను గుర్తించారు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో పోలీసులు వీర గొట్టం జంక్షన్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా భార్యభర్తలిద్దరూ మోటార్ సైకిల్ మీద వెళుతుండగా ఎస్ఐ పట్టుకున్నారు. వీర గొట్టంలో ఈ బంగారాన్ని అమ్మడానికి వెళ్తున్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. బంగారు ఆబరణాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పాచిపెంట

సాలూరు మండలం కందులపదానికి చెందిన శెట్టి బాబ్జీ(43) బుధవారం పురుగు ముందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం బాబ్జీ రెండేళ్లుగా పాచిపెంట మండలం గంగన్న దొరవలస వద్ద వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని పామాయిల్ సాగు చేస్తున్నాడు. సదరు భూములో గడ్డి మందును ఇటీవల పిచికారీ చేశాడు. ఖాళీ డబ్బాను అక్కడే వదిలివేశాడు. కొన్ని రోజులు తర్వాత పొలం పనులు చేస్తుండగా బాబ్జికి దాహం వేయడంతో అక్కడే పడి ఉన్న ఖాళీ డబ్బాతో మంచినీరు తీసుకొని దాహం తీర్చుకున్నాడు. రెండు మూడు రోజులు తర్వాత బాబ్జీకి వాంతులు, విరోచనాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. తగ్గుముఖం పట్టకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు అతని భార్య సూర్యలక్ష్మి పాచిపెంట పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు ఎస్ఐ వెంకట్ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాప్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని కూర్మరాజుపేట గ్రామానికి చెందిన నడిపేన జగదీశ్ (41) తన భార్య, కుమార్తెతో కలిసి పార్వతీపురంలో నివసిస్తున్నారు. బుధవారం తన స్వంత పనులు నిమిత్తం పాలకొండకు బస్‌లో ప్రయాణం చేశాడు. హఠాత్తుగా గుండెపోటు రావడంతో కాంప్లెక్స్‌లోనే అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయాడు. వివరాలు తెలియవలసి ఉంది.